# ఆ ముగ్గురూ

శంకరయ్య "రాముడు మంచి బాలుడు" అనిపించుకునేంతటి మంచివాడు. వినయ సంపన్నుడు.. తల్లిదండ్రులను, గురువులను గౌరవిస్తాడు. తల్లిదండ్రుల మాట జవదాటడు.. ఒక్కరోజు కూడా తప్పకుండా పాఠశాలకెళ్తాడు. బడికి పోయ్యేంతవరకు, పోయి వచ్చింతర్వాత తండ్రికి వ్యవసాయ ప్పనుల్లో సాయం చేస్తుంటాడు. సెలవు రోజుల్లో నాగలి దున్నుతాడు... మోట గొడతాడు... ఎడ్లను చెలుకల్లోకి తోలుకెలతాడు. బంతి కొడతాడు. అన్ని రకాల వ్యవసాయప్పనులు చేస్తాడు... మళ్ళీ మంచి మార్కులతోనే పాసవుతాడు. బడికి వెళ్ళడం, తీరిక సమయాల్లో వ్యవసాయం చేయడం శంకరయ్య చేసేపనులు... శంకరయ్యను ఊరివాళ్ళంతా మంచివాడు, బుద్ధిమంతుడు అంటుంటారు. శంకరయ్య తండ్రికి ఆరేడెకరాల భూముంది.

మనోహర్ తండ్రిదీ శంకరయ్య తండ్రి కుటుంబంలాగే వ్యవసాయ కుటుంబం. మనోహర్ వాళ్ళకూ ఆరెకరాల భూముంది.. మనోహర్ చదువులో పాఠశాలకే ఫస్ట్. అతన్ని ఉపాధ్యాయులు సిన్సియర్ బాయ్ అంటారు. ఊరివాళ్ళు బుద్ధిమంతుడంటారు. అతని కన్నింటికంటె ముఖ్యం చదువు. మొదలే చురుకైనవాడు. ఇంటలిజెంట్.. దానికి తోడు కష్టపడి చదువుతాడు.. ఊరివాళ్ళంతా తమ పిల్లలు మనోహర్‌లా చదువుకోవాలని అతన్నే ఉదాహరిస్తారు.. సెలవు రోజుల్లో తప్ప మనోహర్ తండ్రికి వ్యవసాయ ప్పనుల్లో సాయం చెయ్యడు. స్కూలుంటే తానధికంగా ఇష్టపడే అమ్మమ్మ వాళ్ళింటికి కూడా పోడు.. ఉపాధ్యాయులందరికీ తలలో నాలుకలా ఉంటాడు.. వర్షం వల్లగాని, ఆకతాయి పిల్లల అల్లరి వల్లగాని, అనుకోని సెలవు ప్రకటించడం వల్లగాని, మరే కారణం వల్లగాని పాఠశాల బందయితే అతను అందర్లా సంతోషపడడు.. అందరి కంటె ముందు స్కూలుకెళ్తాడు. అందరూ తిరిగొచ్చింతర్వాత తిరిగొస్తాడు. అతని కన్నింటికంటె చదువే ముఖ్యం. స్కూల్లో అతని అటెండెన్సు సెంట్ పర్సంట్.

పుల్లారావు తండ్రి కుటుంబం కూడా మధ్యతరగతికి చెందిందే.. పుల్లారావు జీవితంలో హుషారయిన వాడే కాని చదువులో శుంఠ.. రౌడీయిజం, దాదాగిరి చేస్తూ స్కూల్ ఫైనల్ వరకు నెట్టుకొచ్చాడు. తల్లిదండ్రుల మాట చెవిని పెట్టడు.. ఉపాధ్యాయులంటే లక్ష్యమే లేదు.. స్కూల్లో నాలుగైదు గంటలు కూచోవడానికి అతనికి తలనొప్పి.. స్టూడెంట్ యూనియన్ ప్రెసిడెంట్‌గా వుంటూ స్కూలుకు సెలవిప్పించడానికి ప్రయత్నిస్తుంటాడు.. స్కూల్‌లేని సమయాల్లో కాని,

సెలవుదినాల్లో గాని, అతడు తల్లిదండ్రుల కేమాత్రం సహాయం చెయ్యడు.. అతనిపై అటు ఊరివాళ్ళకు కాని, ఇటు ఉపాధ్యాయులకు గాని, అతని తల్లిదండ్రులకు కాని మంచభిప్రాయం లేదు.

'ఆ ముగ్గురూ' విలేజిమేట్స్. ఇరుగు పొరుగు కుటుంబాల వాళ్ళు.. స్కూల్ మేట్స్.. క్లాస్‌మేట్స్ మాత్రమే కాకుండా ప్రాణస్నేహితులు.. అన్ని విషయాల్లో వాళ్ళు ఏకీభవించకున్నా వాళ్ళ స్నేహం చిన్నతనం నుంచి కొనసాగుతూనే ఉంది.

అది 1969 వ సంవత్సరం.. ప్రత్యేక తెలంగాణోద్యమం ముమ్మరంగా సాగుతుంది.. వీధులు వెంట ప్రదర్శనలు, స్లోగన్స్, ఆందోళనలు సాగుతున్నాయి. విద్యార్థులు పాఠశాలలను బహిష్కరించారు. ఆ సమయంలో ఆ ముగ్గురు మిత్రులు హెచ్.ఎస్.సి లో వున్నారు.. పుల్లారావు సమధికోత్సాహంతో ఆ ఆందోళనలో పాల్గొంటున్నాడు.. ఉద్యమకారులతో పాటు వీధిలైట్లు పగులగొడుతున్నాడు. బస్సులను కాలబెడుతున్నాడు.. రైళ్ళనాపుతున్నాడు.. బస్సుల్లో రైళ్ళలో ఉచితంగా రాష్ట్రమంతటా తిరుగుతున్నాడు.. పాఠశాలకెళ్ళి చదువుకోవడంకంటె ఇలా తిరగడమే అతనికి బాగుంది.. మనోహర్‌కు చదువు నష్టమవుతుందని బాధగా వుంది. ఆందోళనాకారులు చేస్తున్న పనులను చూస్తుంటే అతనికెంతో ఆవేదనగా వుంది. తండ్రికి వ్యవసాయప్పనుల్లో సాయం చేస్తూ ఇంట్లో చదువుకుంటున్నాడు. ఆ సమయంలో శంకరయ్య, తండ్రి జబ్బుపడటం వల్ల పూర్తిగా వ్యవసాయప్పనుల్లో మునిగిపోయాడు.. అప్పుడప్పుడు ముగ్గురు మిత్రులూ కలుసుకొని మాట్లాడుకుంటున్నారు.. దాదాపు సంవత్సరం పాటు జరిగిన ఆందోళన రెండువందల మంది విద్యార్థులను బలి తీసుకొంది. నాయకులకు పదవులు లభించగానే అది విరమించబడింది.. చాలామందికి విద్యా సంవత్సరం నష్టమయింది.

కొద్దిరోజుల తర్వాత పరీక్షలయ్యాయి.. టేబుల్‌మీద కత్తిపెట్టి పరీక్షరాసాడు పుల్లారావు.. మాస్ కాపీయింగ్ జరిగింది.. కష్టపడి చదువుకున్న శంకరయ్య. మనోహర్‌లాంటి వాళ్ళు బాధపడ్డారు.. పుల్లారావు సంతోషించాడు. నలభై రోజుల తర్వాత పరీక్షా ఫలితాలొచ్చాయి.. 95% విధ్యార్థులు పాసయ్యారు. శంకరయ్య, మనోహర్ ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. పుల్లరావు మాత్రం పరీక్ష తప్పాడు.

"ఈ సమయంలో పాస్ కానివాడు ఎప్పుడూ పాస్ కాడు.."

"పుల్లారావు ఎందుకూ పనికిరాడు.."

రకరకాలుగా అనుకున్నారూళ్ళోవాళ్ళు..

"మనోహర్‌ను చూసి బుద్ధి తెచ్చుకోరా.. ఎందుకూ ఉపయోగపడని చవటవు.. భవిష్యత్తులో ఎట్లా బ్రతుకుతావురా!" అని పుల్లారావు తండ్రి కొడుకును తిట్టాడు.

పరీక్షా ఫలితాలొచ్చిన తర్వాత ముగ్గురు మిత్రులు కలుసుకున్నారు.

పుల్లరావు ఫెయిలయినందుకు మిగతా ఇద్దరు విచారించారు. కాని పుల్లారావు పెద్దగా బాధ పళ్ళేదు.

"ఒరేయ్ పుల్లారావు.. తిరగడాలు మానుకొని బుద్ధిగా చదువుకో.. సప్లిమెంటరీ పరీక్షల్లోనైనా పాస్‌కావడానికి ప్రయత్నించు.. ఈ తిరుగుళ్ళు కూడు పెట్టవు.." మిత్రున్ని మదలించాడు మనోహర్.

"సరే లేరా.. మీరైతే పైకి రండి.. చిన్నప్పట్నుంచి ముగ్గురం కలిసి చదువుకున్నాం.. ఇప్పుడు మీరిద్దరు పైచదువుల కెళ్తున్నారు. నేనొక్కణ్నే ఊళ్ళో వుండాలి.." అన్నాడు పుల్లారావు.

ఆ మాటలు విని శంకరయ్య తలదించుకున్నాడు.

"నేను చదువు మానేస్తున్నానురా.." అన్నాడు బాధగా..

"ఎందుకు? ఫస్ట్‌క్లాసులో పాసైనవాడివి చదువెందుకు మానుకుంటావు?" అన్నాడు మనోహర్..

"మా కుటుంబం సంగతి మీకు తెలియందేముంది..? మా నాన్న రెన్నెల్ల క్రింద చనిపోయింది మీకు తెలుసుకదా..! ఇంటికి నేనే పెద్దవాన్ని.. నేను పట్నంవెళ్ళి చదువుకుంటే ఇల్లును చూసుకునే దెవరు..? అందుకోసం నేను వ్యవసాయం చేస్తాను. నాకాపని అలవాటైందే కదా..!" అన్నాడు శంకరయ్య.

"క్లెవర్‌వై ఉండీ చదువు మానుకోవడం బాగా లేదు.. ఎలాగో వెళ్తుంది.. నువ్వు కాలేజీలో జాయిన్‌కా.." అన్నాడు పుల్లారావు.

"నాకు చదువుకోవాలనే వుంది .. కాని, ఈ పరిస్థితుల్లో అది సాధ్యంకాదు.. బాగా ఆలోచించే ఈ నిర్ణయం తీసుకున్నాను.. ఇంట్లో వుండి వ్యవసాయం చూసుకోడం తప్పదు.." అన్నాడు బాధగా శంకరయ్య.

స్నేహితుడి పరిస్థితికి మిగతా ఇద్దరు విచారించారు.

"మొత్తం మీద మన ముగ్గుర్లో ఒక్క మనోహరే పైచదువులకెళ్తున్నాడన్నమాట.." అన్నాడు పుల్లారావు.

"నువ్వొక్కడివైనా పైకొస్తే మాకదే సంతోషం.." శంకరయ్యన్నాడు.

"చిన్నప్పట్నుంచి కలసి చదువుకున్న మన ముగ్గురం ఇప్పుడు విడిపోతున్నాం.. ముగ్గురి దారులు వేరయ్యాయి. మనమంతా కలసి పైచదువుల కెళ్తే బాగుండేది.." అన్నాడు మనోహర్..

చిన్నప్పటి విషయాల గూర్చి, భవిష్యత్తులో ఎవరేమవుతారోనన్న విషయం గూర్చి, మరెన్నో విషయాల గూర్చి ఆ మిత్రులు ముగ్గురూ చాలా సేపు మాట్లాడుకొని విడిపోయారు. కొద్ది రోజుల్లో మనోహర్ పై చదువులకోసం జిల్లా హెడ్ క్వార్టర్స్ కెళ్ళాడు. శంకరయ్య వ్యవసాయదారునిగా స్థిరపడడానికి నిర్ణయించుకున్నాడు. పుల్లారావేం చేయాలో తోచక రోడ్లు సర్వే చేస్తున్నాడు. పనిపాటలు లేక తిరుగుతున్నాడు..

ఆ ముగ్గురి స్నేహం గూర్చి తెలిసిన ఊరివాళ్లు–

"మనోహర్ అదృష్టవంతుడు..."

"మనోహర్ పైకొస్తాడు.."

"పుల్లారావు ఎందుకు పనికిరాడు.." అని రకరకాలుగా వ్యాఖ్యానించారు..

మనోహర్ నంతా మెచ్చుకున్నారు.. శంకరయ్య మీద సానుభూతి చూపారు.. పుల్లారావును నిందించారు..

☆ ☆ ☆

ఓ పదేళ్ళకాలం కాలగర్భంలో కలిసిపోయింది.. తెలంగాణా ఉద్యమం చల్లారింది.. కొందరి పదవులు పోయాయి.. మరికొందరికి పదవులొచ్చాయి. అటు తర్వాత ప్రత్యేక ఆంధ్రోద్యమమూ వచ్చింది.. అదీ అణచివేయబడింది.. దీనివల్లా కొందరి పదవులు పోయాయి.. కొన్ని ప్రజోద్యమాలూ వచ్చాయి. పాలకులు మారారు.. ప్రభుత్వాలు మారాయి..

ఈ పదేళ్ళ కాలంలో–

శంకరయ్య తండ్రి చనిపోతూ మిగిల్చిన రెండెడ్లతో, అరెకరాల భూమితో వ్యవసాయం ప్రారంభించాడు. రాత్రింబవళ్ళు ఒళ్లు దాచుకోకుండా కష్టపడ్డాడు.. ఱెక్కలు ముక్కలు చేసుకున్నాడు.. వ్యవసాయంలోని కష్టాలన్నీ అతని కనుభవంలోకి వచ్చాయి. ఎంతపని చేసినా అతని పని ఏడే మాన్కలవుతున్నట్లు గ్రహించాడు. వ్యవసాయంతో బ్రతుకు ఎక్కడేసిన గొంగలి అక్కడున్నట్టే వుందని గ్రహించాడు.. ఓ సారి అతివృష్టి.. మరోసారి అనావృష్టి. ప్రకృతి బీభత్సాలతో చేతికొచ్చిన పంట నోటికి రాకపోవడం.. ప్రకృతి కరుణించి పంటోతీరుగ పండినా పండిన పంటకు ధర లేకపోవడం.. అన్ని వస్తువుల ధరలూ ఆకాశాన్నంటడం.. పంట చేతికొచ్చే సమయంలో ధాన్యానికి ధర లేకపోవడం.. పంట బాగానే పండినట్టనిపించినా బొటాబొటిగా ఖర్చులకే సరిపోవడం.. పెట్టుబళ్ళకోసం ప్రైవేటు అప్పులు.. ప్రభుత్వ అప్పులు.. కుటుంబ సమస్యలు.. రోగాలు. రొష్టులు.. శంకరయ్య ఈ కొద్ది కాలంలోనే నూరేళ్ళ అనుభవాలను పొందాడు. అతనికి పెళ్ళయింది.. ముగ్గురు పిల్లలయ్యారు. ఖర్చులు పెరిగాయి.. ఆదాయం తగ్గింది.. శంకరయ్య ముఖంలో కళ తగ్గింది. పని చేసీ చేసీ శరీర పటుత్వం తగ్గింది.. అప్పులు పెరిగి, కొంత ఆస్తి కూడా తగ్గింది.

మనోహర్ డిగ్రీ చదువు పూర్తి చేసాడు.. ఫస్టుక్లాసులో పాసయ్యాడు. ప్రథమశ్రేణి డిగ్రీ వున్నా ఉద్యోగం కోసం కాళ్ళరిగేలా తిరిగాడు.. పట్టుకోగూడని వాళ్ళ కాళ్ళూ పట్టుకున్నాడు.. తుదకెలాగోలా ఉద్యోగం సంపాదించుకున్నాడు.. ఉద్యోగం దొరికింతర్వాత హాయిగా బ్రతుకొచ్చని, ఏ ఇబ్బందులూ ఉండవని భావించిన మనోహర్‌కు ఆశాభంగమే అయింది.. నెలకొంత డబ్బు తల్లిదండ్రులకు పంపుతున్నాడు.. పెళ్ళయింది.. పెళ్ళయిం తర్వాత ఖర్చులు పెరిగాయి కాబట్టి తల్లిదండ్రులకు పంపే డబ్బులో కొంత తగ్గించాడు. తల్లితండ్రులకు మనోహర్‌పై కోపం.. మరింత పంపుతే తమకెళ్ళదని భార్యనుండి గుణిపింపులు.. తల్లితండ్రులు, భార్య మధ్య ప్రచ్ఛన్నయుద్ధం.. ఓ బాబు కూడా కలిగాడు. ఎన్నో జీవితానుభవాలు కలిగాయి. అతను చూస్తూ వుండగానే అన్ని వస్తువుల ధరలూ అందకుండా పెరగడం.. జీతం కొంత కొంత పెరిగినా పెరిగిన ధరలతో ఎందులోనూ పోటీపడక

పోవడం.. ఉద్యోగం దొరికింతర్వాత చీకూ చింతా లేకుండా బ్రతుకొచ్చని నిరుద్యోగిగా వున్నప్పుడతడనుకొన్న మాటలు వమ్మయ్యాయని తొందరగానే గ్రహించాడు. అటు ఉద్యోగం నిర్వహణలో కొన్ని బాధలు, పోటీ; ఇటు డబ్బు పంపడం లేదని అమ్మానాన్నల నుండి గుణపింపులు, పిల్లల కోసం కొంతైనా కూడబెట్టాలని ఇంట్లోకి కొంత ఫర్నీచర్, వస్తువులు కొనుక్కోవాలని భార్య నుంచి ఒత్తిడి.. తనకేం చేయాలో అర్థంకాక సతమతమవుతున్నాడు మనోహర్. గొర్రెతోకలా జీతం, హనుమంతుడి తోకలా అవసరాలు.. మనోహర్‌కెన్నో విషయాలు అనుభవంలోకి వస్తున్నాయి. క్వాలిఫికేషన్ పెంచుకొని, ప్రమోషన్ పొందితే కొంత ఉపయోగకరంగా ఉండొచ్చని ఆలోచిస్తున్నాడు మనోహర్..

ఇక పుల్లారావ్.. రెండు మూడేళ్ళు జులాయిగా తిరుగుతూ కాలం గడిపాడు. అతి కష్టంగా హెచ్.ఎస్.సి. పరీక్ష పాసయ్యాడు. పనీపాట లేకుండా తిరుగుతున్నాడని తల్లిదండ్రులతో తిట్లు తిన్నాడు.. అటు తర్వాత పట్వారితో సంబంధాలు పెట్టుకున్నాడు.. సర్పంచ్‌తో దోస్తీ చేసాడు.. పోలీసు పటేల్‌తో స్నేహం చేసాడు.. ఊళ్ళో చిన్నచిన్నగా పైరవీలు చేయడం మొదలుపెట్టాడు. రైతులకు లోన్లు ఇప్పించడంలో సహాయం చేయడం. ప్రక్కూర్లో వున్న పోలీసుస్టేషన్‌తో సంబంధం... అందులోకి వెళ్ళిన వాళ్ళని విడిపించడం.. ఇలా చిల్లర మల్లర పనులు చేస్తూ కొద్దిరోజులు తన ఖర్చులకు సరిపోను సంపాదించుకున్నాడు. ఈలోగా శ్రీరామసాగర్ ప్రాజెక్ట్ కాలువలు త్రవ్వడం ఆ ప్రాంతంలో ప్రారంభమయింది. ఇంజనీర్‌తో స్నేహం చేసాడు.. తండ్రి దగ్గర్నుంచి కొంత డబ్బు తీసుకొని చిన్న చిన్న కాంట్రాక్ట్ పనులు చేయడం మొదలుపెట్టాడు.. రెండు మూడేళ్ళు గడిచేసరికి అందులోని లోతుపాతులు తెలుసుకున్నాడు.. డబ్బు సంపాదించడంలోని రుచి మరిగాడు.. మరికొంత పెద్ద కాంట్రాక్టులు తీసుకుంటున్నాడు.. ఇంతవరకూ తనకు పిల్లనివ్వడానికి వెనుకాడిన వాళ్ళు తమ కూతుర్నిస్తామని వెనుకబడి తిరుగసాగారు.. అతని వాలకం చూసి పైకొచ్చే లక్షణాలున్నాయని గ్రహించిన పొరుగూరి దొర లక్షన్నర కట్నమిచ్చి పుల్లారావును తన అల్లుణ్ని చేసుకున్నాడు.. అప్పట్నుంచి అతని దశ మరింత తిరగడం ప్రారంభించింది. ఆ కట్నంలోంచి లక్ష రూపాయలు కాంట్రాక్ట్ పనులకు పెట్టుబడిగా ఉపయోగించుకొని పెద్ద కాంట్రాక్టు పడుతున్నాడు. వటుడింతై, ఇంతై, ఇంతింతై అన్నట్టు క్రమక్రమంగా ఎదుగుతున్నాడు పుల్లారావు..

1979 వ సంవత్సరం.. దసరా పండుగ కోసం ఊరికొచ్చిన ముగ్గురు మిత్రులూ కలుసుకున్నారు..

చవక రకం పాంటు, షర్టు తొడుక్కున్నాడు శంకరయ్య. ఎండకు ఎండి, వానకు తడిచి, చలికి వణికిన అతని శరీరం నల్లబడింది. ముఖం ఈడ్చుకుపోయింది.. పదేళ్ళ క్రితం కంటె బరువు తగ్గింది.. ముఖంలో మునుపటి హుషారు లేదు.

టెరీకాట్ పాంటు, షర్ట్ వేసుకొనున్న మనోహర్ నీడపట్టుకుండటం వల్ల కొంచెం రంగుదేలున్నాడు.. కాని ముఖంలో మునుపటి చురుకుతనం లేదు.. ఏదో నిర్లిప్త భావం..

షఫారీ పాంటు, షర్టుతో నిండుగా వున్నాడు పుల్లారావు.. కొంచెం ఒళ్ళు చేసింది.. ముఖంలో చురుకుదనముంది.. కళ్ళలో కాంతుంది.. జేబుల్లో పచ్చనోట్లున్నాయి.

ముగ్గురు మిత్రులు చాలా సేపు మాట్లాడుకున్నారు.. బాల్య జీవితాన్ని జ్ఞాపకం చేసుకున్నారు. చిన్నప్పటి మధుర స్మృతులను మననం చేసుకున్నారు. కాని శంకరయ్య మునుపటిలా జంకుగొంకు లేకుండా మాట్లాడటం లేదు. మనోహర్ మాటల్లో ఏదో పోగొట్టుకున్న భావం.. వెలితి.. అంతా తానే అయి, ముగ్గురి మాటలూ తానే మాట్లాడేస్తున్నాడు పుల్లారావు.. ఇద్దరు మిత్రులకూ మంచి మందు విందిచ్చాడు పుల్లారావు. తెల్లవారి కాంట్రాక్ట్ పనులున్న చోటుకు పుల్లారావు పోయాడు.. ఉద్యోగం చేసే చోటికి మనోహర్ వెళ్ళిపోయాడు.. ఇద్దరు మిత్రులకూ వీడ్కోలిచ్చి ఊళ్ళో మిగిలిపోయాడు శంకరయ్య.

☆ ☆ ☆

మరో పది కేలెండర్లు మారాయి.. ప్రభుత్వాలు క్రిందు మీదయ్యాయి.. గెలిచినవారు, ఓడినవారు ప్రజలకు నానా వాగ్దానాలు చేసారు.. పేదరికం తొలగిస్తామన్నారు.. అందరికీ కనీసావసరాలు తీర్చుతామన్నారు. ఎన్నో ఉద్యమాలు వచ్చాయి. దేశంలో అనేక మార్పులు వచ్చాయి.

ఈ దశాబ్ద కాలంలో-

శంకరయ్య పరిస్థితి మరింత దిగజారింది. ఆ ప్రాంతానికి శ్రీరామసాగర్ ప్రాజెక్టు నీళ్ళొచ్చినా అప్పటికే అతనికున్న భూమి చాలా వరకమ్ముడు బోయింది అతని వ్యవసాయం దాదాపుగా దెబ్బతింది. పిల్ల లెదుగుతున్నారు. ఊళ్ళో పాఠశాలల్లో చదువులు అంతంత మాత్రంగానే వున్నాయి. పట్నం పంపి ఏదైనా ప్రైవేట్ స్కూల్లో చేర్పించే శక్తిలేదు.. అందువల్ల పెద్దవాడు స్కూల్ ఫైనల్ తప్పి బలాదూరుగా తిరుగుతున్నాడు.. పిల్లల భవిష్యత్తు గూర్చి శంకరయ్య కాందోళనగా వుంది.. బాగా చదువుకున్న వాళ్ళకే ఉద్యోగాలు దొరకడం కష్టంగా ఉంటే తన పిల్లలెలా బ్రతుకుతారో అతనికర్థం కావటంలేదు. వ్యవసాయం చేసుకొనైనా బ్రతుకుతారంటే భూమిలేదు. తానెంత కష్టపడ్డా తన పరిస్థితి ఇలా ఎందుకు మారిందో శంకరయ్య కర్థం కావటంలేదు. రైతే రాజు, రైతే దేశానికి వెన్నుముకని నాయకులు ఎన్నికల సమయంలో అరచేతిలో వైకుంఠం చూపించే మాటలనడం జ్ఞాపకం తెచ్చుకొని వైరాగ్యంగా నవ్వుకుంటున్నాడు శంకరయ్య.. ఆ ప్రాంతంలో లేచిన తిరుగుబాటు ఉద్యమాల వల్ల కొన్ని కూలీ రేట్లయితే పెరిగాయి కానీ అదువల్ల శంకరయ్యలాటి వాళ్ళ కొరిగిందేం లేదు. తండ్రి కట్టించిన పాత ఇల్లు కూలిపోవడానికి సిద్ధంగా వుంది.. దాన్ని రిపేర్ చేసే శక్తి కూడా ప్రస్తుతమాతనికి లేదు.. అందుకోసం ఆ పెంకుటెల్లు స్థానంలో గుడిసె వేసుకోవాలనుకుంటున్నాడు.

శంకరయ్య శరీరం శుష్కించింది.. వయసును మించిన ముడుతలు శరీరంలో కనబడుతున్నాయి.. అతని ఆర్థిక పరిస్థితి క్షీణించింది.. అతడిప్పుడు రైతు కాదు, రైతు కూలి..

మనోహర్ పరిస్థితి శంకరయ్యంత ఘోరంగా లేకున్నా అతడూ అనేక ఇబ్బం దుల్నెదురుకుంటున్నాడు.. అతనికి ముగ్గురు పిల్లలయ్యారు.. వాళ్ళెదుగుతున్నకొద్దీ ఖర్చులు పెరుగుతున్నాయి. అన్ని వస్తువుల ధరలూ పెరుగుతున్నాయి. అవసరాలు పెరుగుతున్నాయి.. అతని జీతం కూడా కొంత కొంత పెరిగింది.. కాని పెరిగే ధరలతో, అవసరాలతో పెరుగుతున్న జీతం ఏ విధంగానూ పోటీ పడటంలేదు.. జీవితనౌక నీడ్వలేక ఈడిగిలబడుతూ లాగుతున్నాడు మనోహర్.. ప్రమోషనొచ్చినా, జీతం పెరిగినా పెద్దగా ఆర్థిక పరిస్థితిలో మార్పు లేకపోవడం అతని కాశ్చర్యంగా వుంది. ఉద్యోగంలో చేరినప్పటికీ ఇప్పటికీ జీతంలో మార్పు ఐదురెట్లయినా ఆర్థిక పరిస్థితి నానాటికి దిగజారటం అతనికి బాధగా వుంది. పట్నంలో ఓ చిన్న ఇల్లు కట్టుకోవాలన్న మనోహర్ ఆశ కలగానే మిగిలిపోయింది. జీతం, ఖర్చులు అతి కష్టంగా బొటాబొటిగా సరిపోతుంటే ఇక ఇల్లు కట్టుకోవడమెలాగో అతనికి తోచడంలేదు. పోటీ విపరీతంగా వున్న ఈ కాలంలో తన పిల్లల భవిష్యత్తేమిటో మనోహర్‌కు అయోమయంగా వుంది. కాన్వెంట్ స్కూల్లలోనో, రెసిడెన్షియల్ పాఠశాలల్లోనో పిల్లలను చదివించాలనున్నా అతని ఆర్థిక పరిస్థితి అందుకు సమ్మతించడంలేదు. ఇంకో నాలుగైదేళ్ళలో చేయాల్సిన కూతురు పెళ్ళి గూర్చి, చదువుకుంటున్న కొడుకుల భవిష్యత్తు గూర్చి ఆందోళనగా వుంది మనోహర్‌కు. ఆఫీసు సూపరింటెండెట్ ప్రమోషన్ కోసం పోస్ట్‌గ్రాడ్యుయేషన్ డిగ్రీ అవసరమంటే అది కూడా పూర్తి చేసాడు మనోహర్.. కాని ఆ ప్రమోషన్ ఎంత ప్రయత్నించినా రావడంలేదు.. రెండుసార్లు తనకంటె జూనియర్లు ప్రమోషన్ తన్నుకుపోతే నిస్సహాయంగా నిల్చున్నాడు మనోహర్.. మనోహర్ ముఖంలో మునుపటి కళ లేదు.. జీవితంలో థ్రిల్ లేదు.. గానుగెద్దులా జీవితం గడుపుతున్నాడు..

పుల్లారావు కాంట్రాక్టర్ వృత్తిలోని మెలుకువలు తెలుసుకున్నాడు. ఎవరితో ఎలా మాట్లాడాలో తెలుసుకున్నాడు. ఎవరిని కలుసుకుంటే ఎవరికేమిస్తే కాంట్రాక్ట్ తనకొస్తుందో తెలుసుకున్నాడు. ఎలా లాభాలు గడించాలో అర్థం చేసుకున్నాడు.. రెండు చేతులా డబ్బు సంపాదించాడు.. ఊళ్ళో పెంకుటిల్లు స్థానంలో బిల్డింగ్ కట్టాడు. పట్నంలో అన్ని సౌకర్యాలతో ఆధునిక పద్ధతిలో రెండు బంగ్లాలు కట్టాడు. చెప్పుకో దగిన బ్యాంకు బ్యాలెన్సుంది... ఆర్థికంగా మంచి స్థితిలో కొచ్చింతర్వాత పుల్లారావు దృష్టి రాజకీయాలపైకి మళ్ళింది.. ఓ పార్టీలో మెంబర్‌షిప్ తీసుకున్నాడు.. అధినాయకుడు తమ ప్రాంతానికి వచ్చినప్పుడల్లా కలుసుకున్నాడు. అతనికన్ని రకాల సౌకర్యాలు కల్పించాడు. పదిహేను రోజులకోసారి సిటీకెళ్ళి పార్టీ నాయకులను కలుసుకున్నాడు. పార్టీకి విరివిగా చందా లిచ్చాడు.. అధికారం వున్నప్పుడూ, లేనప్పుడూ పార్టీ నాయకుల కండగా నిలిచాడు... అధినాయకుని దృష్టిలో పడ్డాడు. మొదట మండలాధ్యక్షుడుగా ఎన్నికయ్యాడు. ఆటుతర్వాత జరిగిన ఎన్నికల్లో M.L.A. గా సీటు సంపాదించాడు. M.L.A. గా గెలవడమే కాకుండా అందరి నాశ్చర్యంలో ముంచుతూ మంత్రి కూడా అయ్యాడు. పుల్లారావు మఖాం ఇప్పుడు సిటీకి మారింది. పిల్లలు సిటీలో వున్న పేరున్న కాన్వెంట్లలో చదువుతున్నారు.

శంకరయ్య జీవితమిప్పుడు ఔట్ డేటెడ్ అయిన పాతబడ్డ రేడియో సెట్టులా వుంటే, మనోహర్ జీవితం బ్లాక్ అండ్ వైట్ టీ.వీ.లా వుంది. పుల్లారావు జీవితం ఇంపోర్టెడ్ జపాన్ కలర్ టీ.వీ. లా వుంది. శంకరయ్య ఇంట్లో పాత రేడియో, మనోహర్ ఇంట్లో బ్లాక్ అండ్ వైట్ టీ.వీ., పుల్లారావింట్లో కలర్ టీవీ, వున్నాయి.. శంకరయ్య జీవితం డొక్కు సైకిల్లా వుంటే, మనోహర్ జీవితం ఇన్‌స్టాల్‌మెంట్లలో కొన్న సెకండ్ హాండ్ లాంబ్రెట్టాలా వుంది.. పుల్లారావు జీవితం మారుతీ కారులా వుంది.. వాళ్ళకున్నవీ ఆయా వాహనాలే..

1989 వ సంవత్సరం.. మంత్రి పదవి లభించింతర్వాత మొదటిసారిగా స్వగ్రామం వచ్చాడు పుల్లారావు. ఇంటినిండా జనం.. మంత్రిని కలవడానికి ఊరివాళ్ళంతా వస్తున్నారు... చుట్టుపక్కల ఊరివాళ్ళొస్తున్నారు. పార్టీవాళ్ళొస్తున్నారు. పైరవీకార్లొస్తున్నారు.. ఎందుకూ పనికిరాడని ఇరవై ఏళ్ళక్రితం నిందించిన ఊరివాళ్ళే పుల్లారావుతో మాట్లాడటానికి తహతహలాడుతున్నారు.. అతన్నభినందిస్తున్నారు.. వేనోళ్ళా పొగుడుతున్నారు.. తమ వూరికి మంత్రియైన పుల్లారావు వస్తున్నాడని తెలుసుకున్న మనోహర్ ఉద్యోగం చేసే పట్నం నుండి ఊరికొచ్చాడు. శంకరయ్యను కలుసుకున్నాడు. ఇద్దరు మిత్రులు కలిసి పుల్లారావును కలసి మాట్లాడాలని అతనింటి కెళ్ళారు. ఇంటి నిండా జనం.. రెండు మూడు గంటలు గడిచినా వాళ్ళకు పుల్లారావును కలుసుకోవడానికి అవకాశం లభించలేదు. మిత్రులొచ్చింది గమనించిన పుల్లారావు కొద్దిసేపట్లో అందర్నీ పంపించి వాళ్ళిద్దర్ని లోపలికి పిలిచాడు.. బెడ్‌రూమ్‌లోకి తీసుకెళ్ళాడు.. చిన్ననాటి మిత్రులు ముగ్గురూ కుర్చీల్లో కూర్చున్నారు..

ఆ ముగ్గురూ నలభై ఏళ్ళ వయస్సుకు దరిదాపుల్లో వున్నారు.. ముగ్గురి చెంపలూ తెల్లబడుతున్నాయి.. ఇరవై ఏళ్ళ క్రితం విద్యార్థులుగా వున్న ఆ ముగ్గురు మూడు రకాల జీవితానుభవాలతో పండిపోయారు. ఇరవై ఏళ్ళ క్రితం దాదాపు ఒకే స్థితిలో వున్న ఆ ముగ్గుర్లో ఒకరు అట్టడుగు స్థానానికి నెట్టివేయబడ్డాడు. మరొకరు చాలీచాలని సగటుమనిషి జీవితాన్ని వెళ్ళదీస్తున్నారు.. ఇంకొకరు ఉన్నత వర్గంలో కలసిపోయారు.

అపారం, అంగీ, ధోతీ ధరించివున్న శంకరయ్య ముఖం ఈడ్చుకుపోయింది... వయ సును మించిన ముడుతలు ముఖంపై కనబడుతున్నాయి. డొక్క వెన్నుకంటుకుపోయి ఊపిరి లేనివాడిలా వున్నాడు.

చవకరకం పాలిస్టర్ పాంటు, షర్టు ధరించిన మనోహర్ ముఖంలో నిర్లిప్తత. కళ్ళు లోతుకు పోయున్నాయి. చేతికి గడియారముంది.

గ్లాస్కో పంచె, సిల్కు లాల్చి ధరించివున్న పుల్లారావు చిదిమితే రక్తం వచ్చేట్టున్నాడు.. ముఖంలో గంభీరత.. నిండుగా విగ్రహం.. అప్పుడప్పుడే పెరుగుతున్న పొట్ట... ఎడమచేతి వేళ్ళకు రెండుంగరాలు, కుడిచేతి వేలికో ఉంగరం..

మిత్రులని చూసి చిరునవ్వు నవ్వాడు పుల్లారావు.. మిత్రుని నవ్వుకు సమాధానంగా మధ్య తరగతి మందహాసం చేశాడు మనోహర్.. పెదవులు విడివడి విడివడనట్టు నవ్వాడు శంకరయ్య...

"బాగున్నారా...?" అడిగాడు పుల్లారావు...

ఏం చెప్పాలో వాళ్ళకర్థం కావడంలేదు...

తమ కందనంతటి ఎత్తుకెదిగిపోయిన మిత్రునితో ఫ్రీగా మాట్లాడటానికి జంకుతున్నారు వాళ్ళు. శంకరయ్యకైతే పుల్లారావుతో మాట్లాడటమంటేనే భయం భయంగా వుంది..

ఖాళీగా తిరుగుతున్న తన కొడుక్కేదైనా దారి చూపించమని మిత్రుడైన మంత్రి గారికెలా చెప్పాలో అర్థంకాక సతమతమవుతున్నాడు శంకరయ్య. చాలాకాలంగా రాని ప్రమోషన్ కోసం రికమెండ్ చేయమని మిత్రున్నడగడానికి సంకోచిస్తున్నాడు మనోహర్. తనతో మాట్లాడటానికి తటపటాయిస్తున్న మిత్రులను చూసి "నే నిప్పుడేమయినా మీరు నాకు చిన్ననాటి స్నేహితులే.. నాతో మాట్లాడటాని కెందుకు తటపటాయింపులు..? మన మిప్పుడు మనమున్న స్థితులను మరిచిపోయి బాల్య స్నేహితుల్లా మాట్లాడుకుందాం.." అన్నాడు పుల్లారావు చొరవగా..

శంకరయ్య ముఖంలో బెరుకు, మనోహర్ ముఖంలో సందేహం ఆ మాటలతో కొంత దూరమయ్యాయి.

కలసి తిరిగిన ప్రదేశాల గూర్చి, ఆడిన ఆటల గూర్చి, చేసిన అల్లరి గూర్చి, తమ మధ్యవున్న మిత్రత్వం గూర్చి చాలాసేపు మాట్లాడుకున్నారు..

ఎన్నో బాల్య స్మృతులను జ్ఞాపకం చేసుకున్నారు.. తాము, తమ ఊరివాళ్ళూ హించిందానికి, తారుమారైన ఆ ముగ్గురి పరిస్థితులను గూర్చి మననం చేసుకున్నారు.. తర్వాత మిత్రులిద్దరికీ తనతోనే భోజనం ఏర్పాటు చేసాడు పుల్లారావు.. తనెప్పుడూ ఊహించని విధంగా ఆ భోజనం వుంది శంకరయ్యకు.. తనకిలాంటి భోజనం కావాలని కోరుకున్నా ఇంతవరకు రుచి చూడలేదు. మనోహర్... అటుతర్వాత మందు విందు కూడా ఇచ్చాడు పుల్లారావు.. తాము చెప్పాలనుకున్న విషయాలు ఆ హడావిడిలో మరిచిపోయారు.. ఇంట్లోంచి బయటకెళ్ళేపుడు జ్ఞాపకం వచ్చినా మళ్ళీ వెనక్కెళ్ళి చెప్పడానికి మనసొప్పలేదు వాళ్ళకు. దానికి తోడు మంత్రిగారు నిద్రపోతారని బాడీగార్డ్స్ హడావిడి చేస్తున్నారు. ప్రొద్దునొచ్చి చెప్పుదామని తమ ఇండ్ల దిక్కు నడుస్తున్నారు శంకరయ్య, మనోహర్... మంత్రయినా తమతో అంత బాగా మాట్లాడిన పుల్లారావు సహృదయతను గూర్చి తమలో తామే మెచ్చుకుంటూ ఇండ్లు చేరుకున్నారు. తెల్లవారి లేచి పుల్లారావింటి దిక్కెళ్ళుతున్నారు.. వాళ్ళకెదురుగా దుమ్ము రేపుకుంటూ ముందో కారు, వెనుక రెండు కార్లు పోతుంటే మధ్యన పుల్లారావు కారు వెళ్ళిపోయింది.

కార్లు లేపిన దుమ్ము కళ్ళలో పడుతుంటే, కళ్ళు నులుముకుంటూ తమ ఇండ్ల దిక్కు నడిచారు వాళ్ళు...

● 'రచన' సచిత్రమాసపత్రిక, *1991*, మార్చి. ●

★ ★ ★